# అంగార శిశువు

## వాడ్రేవు చినవీరభద్రుడు

అప్పుడే ప్రెస్‌లోంచి రిలీజయిన ఇన్విటేషన్ కార్డ్సు నా చేతిలో పెట్టాడు సుబ్బా. ఆగస్టు పదిహేను సందర్భంగా టౌన్ హాల్లో జరగబోయే సమావేశం ఆహ్వానాలు. ఆహ్వానించబడ్డ పుర ప్రముఖులు నాకు తెలిసినవాళ్ళే. పోతే, కొత్తగా కన్పించిన ఒక పేరు పైకి చదివి ''ఎవరీయన'' అనడిగేను. ''అక్కడ రాసి లేదూ, తామ్రపత్ర గ్రహీత'' అన్నాడు సుబ్బా. ''అరె, ఈయన పేరు నువ్వు వినకపోవడం ఆశ్చర్యంగా వుందే. మనం ఇప్పుడు ఆయన దగ్గరికే వెళ్ళాలి. ఈ ప్రోగ్రాం గురించి మాట్లాడాలి'' అని కూడా అన్నాడు. ''పర్మిషన్ తీసుకోకుండా పేరెట్లా వేసేశావ్?'' అంటే ''ఆయన అట్లాంటివి పట్టించుకునే మనిషి కాదు. అదీకాక పిలుస్తున్నది నేనాయె'' అన్నాడు. సుబ్రహ్మణ్యం స్థానిక దినపత్రిక ఎడిటర్. పుట్టిందీ పెరిగిందీ ఈ వూళ్ళోనే.

స్వాతంత్ర్యయోధుడు అని తెలియగానే నాకా పెద్ద మనిషిని చూడాలనిపించింది. ఊళ్ళో నేనెన్నడూ చూసి వుండని సందులూ గొందులూ తిప్పి చివరకి ఓ పాత పెంకుటిల్లు ముందు ఆగాడు సుబ్బా. అక్కడంతా మురిగ్గా వుంది. గోడలు ముక్కవాసన కొడుతున్నాయి. జిల్లేడు తుప్పలు. కాని ఇంటి ఆవరణ మాత్రం శుభ్రంగా వుంది. వేపచెట్టు మీంచి గాలి. తులసి మొక్క దగ్గిర వాడిన నిత్యమల్లి పూలు. ఆ ఆవరణలో మరి కొన్ని కుటుంబాలు వుంటున్నట్టుంది. సుబ్బా ఒకటి రెండు సార్లు పిలిచాక తలుపు తెరుచుకుంది. ఆయన ముందుకు తొంగిచూసి మిత్రుణ్ణి గుర్తుపట్టి మమ్మల్ని లోపలికి రమ్మన్నాడు.

అరవయ్యేళ్ళ వయసుంటుంది. కాని వయసుని మించిన వార్ధక్యం ఆయన్ని కరుచుకుని వుంది. మనిషి వెన్ను ఒంగింది. నుదుటిమీద ముడుతలు ముసిరిగా వున్నాయి. కాని కళ్ళు మాత్రం షార్ప్‌గా, దీప్తిమంతంగా వున్నాయి.

''ఇతను నా మిత్రుడు. మన పేపర్‌లో దేశ కాల సమస్యలమీద రాస్తుంటాడు'' మీరు చూసే వుంటారు.

ఆయన నన్ను పరీక్షగా చూసి ఆదరంగా నవ్వాడు బోసి నవ్వు. నేను చేతులు జోడించాను.

ఆయన వుంటున్నదల్లా చిన్నగది. ఇరుగ్గా, వుక్కగా వుంది. సుబ్బా మంచంమీద ఆయన పక్కన కూచున్నాడు. నేను వెదురు మోడా జరుపుకుని గది కలియ చూశాను. దండెంమీద మాసిన గుడ్డలు, గదంతా పాత సామాను, మంచంమీద తలుపులకి, కిటికీలకి ముతక ఖద్దరు. ఆయన ఒంటిమీద అంగోస్త్రం, యజ్ఞంపోగు, అంతే. గోడమీద గాంధీ, నెహ్రూ క్విట్ ఇండియా రోజుల ఫోటో. టేబిల్ మీద ఫోటోకేస్. పక్కన గాంధీగారి మూడు కోతుల బొమ్మా. బీరువాలో నెహ్రూగారి రచనల దళసరి బైండ్లు.

''ఏం చదువుకొన్నావు బాబూ?''

చెప్పాను.

''ఈ కాలంలో కుర్రాళ్ళకి మన చరిత్రా, సంస్కృతీ ఏవీ తెలియవు. ఏవీ అక్కర్లేనట్టుగా వుంటారు. కాని ఇదిగో మీలాంటి వాళ్ళని చూస్తుంటే ఆశ కల్గుతూ వుంటుంది.''

నేను వినీవిననట్టుగా వూరుకున్నాను. కాని సుబ్బా మాత్రం ''ఇతను స్వాతంత్ర పోరాటం మీద గొప్ప స్టడీ చేసాడండీ, ఒక గేయ రూపకం కూడా రాసాడు'' అన్నాడు. ఆయన ''చాలా సంతోషం బాబూ'' అని మాటల కోసం వెతుక్కుంటుంటే నేను అందుకున్నాను ''మేం పుస్తకాల్లో, ఫోటోల్లో — చదివిన, చూసిన గాథ- దాన్ని మీరు, మీరు ప్రత్యక్షంగా చూశారు. అనుభవించారు.'' వాక్యం పూర్తిచేయలేక పోయాను. ఎవరో చారిత్రకమయిన వ్యక్తితో మాట్లాడుతున్నానన్న వూహ స్తబ్ధ పర్చింది. మాన్యుమెంట్లను వుద్దేశించి కవిత్వం చెప్పగలం కాని, సంభాషణ జరపలేం. దిగులుగా అన్పించింది.

> ''చేతులు చాచుకుంటూ,
> శ తువుల్ని పిల్చుకుంటూ
> లోనికి వెళ్ళిన కొద్దీ
> అంగార శిశువు తేజస్సు మంటల్ని చిమ్ముతున్నది.
> సత్యపథం అలవాటులేని కాళ్ళని కత్తులతో
> కోస్తున్నది..'' —వరవరరావు

''అవును బాబూ. అది గతించిపోయినట్టుగా అన్పించదు. నేను ఇంకా అనుభవిస్తున్నట్టే వుంటుంది. ఇంతా చేసి మేం చేసింది ఏ మాత్రమని?'' ఆయన జ్ఞాపకాలలోకి వెళ్ళిపోయాడు. ''క్విట్ ఇండియా నాటికి నాకు ఇరవయ్యేళ్ళ వయసు. అప్పుడు దేశమంతా పెద్ద జైలులాగా వుంది. మాట నలభై నాలుగుతో పట్నాన్ని మూసేశారు. నేనూ, మరి నలుగురం కలిసి రోడ్డు మీద పడ్డాం. ఏదో వుత్సాహం. ఇంట్లో ఎవరికీ చెప్పనేలేదు. అందరి ఎదటా తాలుకాఫీసు మీద జెండా ఎగరెయ్యాలి. మాలో ఒకడుండేవాడు, మహా చురుకయినవాడు. జెండా పట్టుకుని 'మహాత్మాజీకీ జై' 'డు ఆర్ డై'' అంటూ తాలూకాఫీసు మీదకి ఎక్కేశాడు. ఇంతలో ఎప్పుడొచ్చిందో పోలీసు జీపు. ఎవడు తుపాకి గురి పెడతాడో కాని అట్లా వీరుడిలా జెండా పట్టుకున్నవాడు అలాగే ఒరిగిపోయాడు. మా వీపుల లాఠీలు విరి గాయి. అయితేనేం, మేం చెయ్యెత్తలేదు. ఒక్క నిందా వాక్యం పలకలేదు. తీసుకుపోయారు. ఓ విచారణ లేదు ఏమీ లేదు, జైల్లో పారేశారు. అట్లా తొమ్మిది నెలలు..''

ఆయన అసలు అన్ని వాక్యాలు చెప్పాలనుకోకుండానే చెప్పినట్టున్నాడు. కంఠం ఆవేశంతోనూ, అనుభవాల బరువుతోనూ ఒణికింది.

''అదంతా ఎందుకు చేశామో అప్పుడు తెలియదు. గాంధీగారు, ఆయన ఫిలాసఫీ నాకు సరిగ్గా తెలియనే తెలియదు. కాని అదొక వుత్సాహం. అలా చెయ్యడమే మా కర్తవ్యం అన్నట్టు. అంతే నా జీవితంలో నాదీ అని చెప్పుకోదగిందీ, సంతృప్తిపడదగిందీ ఆ ఒక్క అనుభవమే.''


మాటల్లోనే ఆయన బీరువా తెరిచి ఒక ఫైలు, ఇంగ్లీషు బుక్కు తీసుకువచ్చారు. ఆ పుస్తకం నెహ్రూ కుటుంబం చరిత్ర. ఆయన పుస్తకం తెరిచి ఒక ఫోటో సుబ్బాకి చూపించారు. సుబ్బా ఆ ఫోటోలో మోతీలాల్ నెహ్రూ వెనగ్గా వున్న కాంగ్రెస్ మనిషిని చూపిస్తూ, ''ఈయనే వీళ్ల నాన్నగారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేశారు. చూశావు కదా, నెహ్రూ ఫామిలీకి బాగా దగ్గర. నాన్ కోపరేషన్ రోజుల్లో న్యాయవాద వృత్తి వదిలి ఉద్యమంలోకి దూకారు.''

ఆయన గొప్ప వివశత్వంతో అందుకున్నాడు. ''అప్పట్లో ఇక్కడికి నాయకులు ఎవరు వచ్చినా నాన్నగారి దగ్గరే ఆతిథ్యం. ఇక్కడ కాంగ్రెస్ సభలు జరిగినప్పుడు నిర్వహణ అంతా ఆయనే. మీకు తెలుసా- తిలక్ నిధికి నాన్నగారు తన ఒక్కచేతి మీదే వేలకొద్దీ విరాళం

పోగుచేశారు. బాపూ అన్నారుట నీలాంటి వలంటీర్స్ మరి కొందరుండాలే కాని ఏడాదిలో ఇండిపెండెన్స్ తేలేమా అని''

ఫైల్లోంచి ఆయన ఒక కవర్ తీసి అందులోంచి మరో పెద్ద ఫోటో తీశారు. పుస్తకంలో దానికి ఎన్లార్జిమెంటు. ''ఇది మన పేపర్‌లో వేస్తాను. నాన్నగారి మీద నాలుగు వాక్యాలు రాసివ్వకూడదూ'' సుబ్బా అన్నాడు.

''నాన్నగారి గురించి నేను రాయగలనా? నాకేం తెలుసని? ఆయన నాకు చదువు చెప్పించలేదు. ఆస్తి మిగల్చలేదు. ఒకసారి ఏమన్నారో తెలుసా? బాబూ గాంధీగారు నాకు బహుమానంగా ఇప్పించింది లాఠీ దెబ్బలూ, జరిమానాలూ, జైలూను. వాటివల్ల ఆనందం నాకు తెలుసు. నీకు ఎలా చెప్పను? ఇవాళ నేను నీకు ఇవ్వగలిగేది



ఏమన్నా వుంటే అదే అని. నాకు ఆ మాటలు ఏమాత్రం అర్థమయ్యాయి? ఆయనలా ఒక జీవితాన్ని నిర్మించుకుని దాన్ని చేజేతులా ఒదులుకోగలనా? అంత ఆత్మబలం నాకుందనుకోను''— ఆయన తన తండ్రి గురించి చెబుతున్నట్టుగా లేదు. ఒకప్పుడు తాను కలిసిన వీరుడి గురించి జ్ఞాపకం చేసుకుంటున్నట్టుంది.

''మరి ఆయన ఫార్టీ సెవెన్ దాకా వున్నారా?''

''ఆయనకి ఆ అదృష్టం లేకపోయింది. నలభై మూడులో కాబోలు అప్పుడు నేనెక్కడో జైల్లో వున్నాను. మా అమ్మ. ఆమెదే దుఃఖమంతాను. కాని ఆయన అప్పటికే కబురు చేశారుట. ఒకవేళ తను మరణించినా అది గర్వపడాల్సిందే తప్ప ఏడవాల్సింది కాదని. అవును ఆయన మంచంపట్టి తీసుకు తీసుకు చచ్చిపోలేదు. భోగభాగ్యల్తో ఆత్మని చంపుకోలేదు, మనిషిలా బతికేరు, మనిషిలా చచ్చిపోయారు.''

కాసేపు మౌనం తర్వాత ''నువ్వు ఏం వ్యాసాలు రాస్తుంటావు'' అనడిగారు. ''వున్న సమస్యల గురించి'' అంటుండగా సుబ్బా ''ఈమధ్య పంజాబ్ గురించి రాశాడు'' అన్నాడు.

''అలాగా అదంతా దేశద్రోహుల నాటకం. ఆవిణ్ణి నిందిస్తే ఏమవుతుంది చెప్పు. మన అపొజిషన్‌కి వేరే పని లేదు. ఆ వాజపేయీ, ఆ చరణ్‌సింగూ, ఇక కమ్యూనిస్టులు సరేసరి. ఇంత పెద్ద దేశంతో నెగ్గుకు రావడమంటే మాటలా?''

నేను ఆశ్చర్యపోయాను. ఆయన అంత స్థూలంగా వ్యాఖ్యానించెయ్యడం నాకు కష్టంగా వుంది.

''అయినా నెహ్రూ కుటుంబంలా ఎవరు త్యాగాలు చెయ్యగలరు వీళ్లల్లో?''

ఆయన ఇంకా చెప్తూనే వున్నాడు. దేశం నెహ్రూ కుటుంబం చేతుల్లో భద్రంగా వుంటుందని ఆయనకి ఎంత విశ్వాసం. నా వూహలు ఇలా వున్నాయి నేనేమీ మాట్లాడలేదు.

సుబ్బా కలగచేసుకుని ''ఇంతకూ మేం వచ్చిన సంగతేమంటే, ఆగస్టు పదిహేనున టౌన్ హాల్లో మీటింగ్. ఆవాళ మీరు వస్తున్నారు'' అన్నాడు. ఆయన ''ఆహా, కాని ఎందుకు బాబూ నీకీ తాపత్రయం? ఈ వూళ్లో నేను బతికివున్నానని ఎవరికి గుర్తు? వీళ్లకి మేం అక్కర్లేదు. వీళ్ల పూర్వులు ఎన్నో త్యాగాలు చెయ్యబట్టే కదా ఇవాళ వీళ్లింత సుఖంగా వుండగల్గుతున్నారంటే (అది అబద్ధం అందామనుకున్నాను) ఎంత గొడవ, రణరంగం అయితే వచ్చిందని. వీళ్లేమిటి, దేశమే అలా వుంది. హరే కృష్ణ మహతాబ్ స్వాతంత్ర్య యోధుల సభలు జరిపాడు. ఎవరికి పట్టింది? అదే అమితాబ్ బచ్చన్ షూటింగను...ఇందిరాజీతో ఎపాయింట్‌మెంట్ కోసం సెక్రటేరియెట్‌లో పడిగాపులు పడ్డానా ఒక్కడు పట్టించుకున్న పాపాన పోలేదు. నాన్నగారి సబర్మతీ ఫ్రెండొకాయన స్వయంగా అలెగ్జాండర్‌కి ఉత్తరం రాశాడు. అయినా సరే, ఆవిడ చుట్టూ వుండే దేశం ఇలా వుంది. తిట్టేదేమో ఆవిణ్ణి. సరే తప్పకుండా వస్తాను. పదిహేనంటే ఎల్లుండే కదూ.''

నాకు ఆయన మాటల వెనుక ఆవేదన ఇప్పుడు స్పష్టంగా తెలిసింది. కాని ఆయనకు ఎలా చెప్పను? ఆయన అనుకుంటున్నట్టుగా బయట ప్రజలు హాయిగా, సుఖంగా ఏమీ లేరని. వాళ్లు అలా వుండివుంటే ఈ యోధుల్ని నెత్తిమీద పెట్టుకునేవారు అనుకోవడానికి సందేహమేముంది?

మేం వస్తామని లేచాం. ఆయన గుమ్మందాకా వచ్చాడు. ''నిన్ను కలుసుకున్నందుకు సంతోషంగా వుంది బాబూ, అన్నట్టు వామనరావుగారు మీటింగ్‌కు వస్తున్నారు కదా'' అన్నాడు. ''అయ్యో వామనరావుగారు ఇప్పుడే రావాల్సింది. కుదర్లేదు'' అన్నాడు



## అమర్ ఖయ్యామ్

తలపయి మండుటెండలను దాలిచి చల్లని నీడ లిచ్చు పొం
ధులకు; కఠోరమౌ శిలలతో పడమోదిన పూలు కాయలున్
ఫలము లొసంగు; ప్రాణముల బాసియు కాయము గోసి యిచ్చు; నీ
యిల నరజాతికిన్ తరువులే గురువుల్ పరమార్థబోధనన్.

పచ్చని పంటచేలు; పయిపై జను మబ్బులచాలు; తోటలో
విచ్చిన జాజిపూలు; నులివెచ్చని తేనెలు; వానలున్; గడున్
ముచ్చట గొల్పు లేళ్లు; మరి బుల్బులులున్; సెలయేళ్ళు; సాకి అం
దిచ్చెడు ద్రాక్ష పానకము; లివ్వి ఖయామును ప్రాణతుల్యముల్.

బ్రతుకొక కొండలోయ; పొరపాటుగ ప్రక్కకు కాలు వైచినన్
పతనము దప్ప; దీ యిరుకుబాట పయిం బయనించి. యెందరో
సతమతమైరి; యాత్ర కొనసాగిన వారొకరైన లేరు; పం
డితులును పాదుషాలు ''బురిడీ పడి'' రీ గరిడీ పరీక్షలో!

డాక్టర్ 'కరుణశ్రీ' అమర్‌ఖయ్యామ్ పద్యకావ్యం నుంచి

సుబ్బా. వామనరావు సంఘసేవకుడు. ప్రజోపయోగ కార్యకలాపాలకి ఆయనదే ముందడుగు. ఈయనకి వామనరావుగారు చాలా దగ్గర అనీ, కష్టం సుఖం చూస్తుంటాడని సుబ్బా తర్వాత అన్నాడు.

ఇంతలో ఆవరణలో అలజడి. పక్క వాటాలో గృహిణి వాళ్ల పనిమనిషి మీద కేకలేస్తోంది. సుబ్బా ముందుకెళ్లి సంగతేమిటన్నాడు. ఆమె చెప్పింది. ''మా గుడిసెల్ని మున్సిపాల్టీవాళ్లు పీకేస్తారుట. అక్కడ ఫేక్టరీ కడతారట. ఈ నాల్రోజులూ తిండీ తిప్పలూ లేవు. ఆళ్ల దగ్గరికీ, ఆళ్ల దగ్గరికీ తిరుగుతున్నాం. వున్నది కూసింత నీడ, అది కూడా వూడలాక్కుంటే ఇంకెట్టా బాబూ.''

మేం నిస్పృహాయంగా బయటికి కదిలాం. గుమ్మం దాటుతూ అప్రయత్నంగా వెనక్కి తిరిగి చూస్తే ఆ వృద్ధుడు తలుపుని ఆనుకుని అయోమయంగా నిల్చుని వుండిపోవడం కన్పించింది.

–:2:–

పదిహేను మీటింగు జయప్రదమయిందనే అనాలి. అదంతా సుబ్బా, వామనరావుగారూ కలిసి చేశారు. ఆవాళ ఆయన స్టైప్‌కి వచ్చాడు. కాని ఏదో పరాయి స్థలంలో తెలియని మనుష్యుల మధ్య వున్నట్టుగా ఇబ్బంది పడడం గుర్తించాను. ఆవాళ ఆయన్ని సభకు పరిచయం చేస్తూ ఏం చెప్పానో గుర్తులేదు కాని ఆయన తండ్రి గారి గురించి మాత్రం చెప్పకుండా వుండలేకపోయాను. అప్పుడు ఆయన సగర్వంగా ఫీలయ్యేవుంటాడు. కాని ఏమీ మాట్లాడలేదు. అంతకన్నా మాటాడనివ్వలేదు అనడం సబబు. నగరంలో ఎన్నాళ్లనుంచో పెట్టాల్సిన ఫాక్టరీని పెట్టించడానికి ఆ సభను వేదిగ్గా వామనరావు గారు వీలయినంతా వాడుకున్నాడు. ఆయన్ని కూడా నాలుగు మాటలు మాటాడనివ్వాల్సింది'' అని సుబ్బాతో అంటే ''తన గోడంతా చెప్తాడు. అదంతా దేశంపట్ల బాధే అనుకో. కాని ఎవడు వింటాడు? ఎవరికి కావాలి? నువ్వే చూశావు కదా, ఆ మీటింగులో రాబోయే పార్లమెంట్ ఎన్నికల గొడవే కదా'' అనేశాడు. ఆవాళ ఆయనకి శాలువా కప్పి సత్కారం కూడా చేశారు. అది వామనరావుగారికి ఆయనపట్ల భక్తిని తెలియ జేసిన విధం అని విన్నాను.

—:3:—

కొన్ని రోజుల తర్వాత ఒక సాయంకాలం ప్రెస్‌లో కూచుని సుబ్బాతో మాట్లాడుతున్నాను. స్వాతంత్ర్య పోరాటంమీద నేను రాసిన గేయ రూపకం రాజధానిలో వేయించే ప్రయత్నాల గురించి. ఇంతలో ఫోన్. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి. పట్నంలో పరిస్థితి రెండు రోజులుగా బాగులేదు. కొన్ని ఏరియాల్లో నిషేధాజ్ఞలు కూడా. ఎస్సై ప్రెస్ ఇన్ఫర్మేషన్ ఇస్తున్నాడు. ఫలానా పేటలో ఆందోళన జరిగిందని, కొందరు అలజడి చేసి నినాదాలు చేశారని. వాళ్లని కస్టడీలోకి తీసుకోడం జరిగిందని.

వాళ్ల పేర్లు నోట్ చేసుకుంటూ సుబ్బా హఠాత్తుగా ఆశ్చర్యంగా ఒక పేరు పైకే చదివాడు. అర్థం కాకుండా చూస్తున్న నన్ను కుదుపుతూ ''గుర్తుపట్టలేదూ మీ తామ్రపత్ర గ్రహీత'' అన్నాడు. ఆశ్చర్యపోయాను. వెళ్లి చూడాలనిపించింది. మేటర్ కంపోజింగ్‌కి ఇచ్చేసి సుబ్బా నన్ను తీసుకుని స్టేషనుకి వెళ్లాడు.

ఇద్దరం నేరుగా లాకప్ దగ్గరికి వెళ్లాం. లోపల నీర సించిపోయిన దేహంతో కన్పించాడు. ముఖం వడిలిపోయి వుంది. ముతక ఖద్దరు చొక్కా మరింత మాసింది. కాని ఆ కళ్లు మాత్రం ఎప్పటికన్నా మరింత దీప్తిమంతంగా వున్నాయి.

''ఇదేమిటి మీరీ వయసులో'' అన్నాడు సుబ్బా. ఆయన చిరునవ్వు నవ్వాడు. ''వుండండి. ఎస్సైతో మాట్లాడతాను'' అని వెళ్లాడు. ఆ కాస్తలో నీలు చూసు కుని ఆయనతో అన్నాడు.

''మిమ్మల్ని ఇలా చూడడం కొంత ఆశ్చర్యంగానే వుంది. అసలేమయింది.?''

''ఏముంది బాబూ? ఇదంతా తుపాకి రాజ్యం. పోలీసు కల్చరూను. అంతా పేదలమీద జులుం. నోరు లేని వాడిమీద సవారీ. బలహీనుల మీద ప్రతాపం. తిండి దోచుకుంటారు. సరే, వుండడానికి నీడ కూడా లేకుండా చేస్తారా? ఎవడి బాబుగాడి స్థలమని అక్కడ ఫేక్టరీ కడతారు? బుల్‌డోజర్లతో కూలుస్తారా గుడి సెల్ని? సత్యాగ్రహం చేస్తాం, మా శవాల మీద దొర్లించండి చక్రాలన్నాం. అందుకు కూడా తెగించిన వాళ్లే.''

ఆయన మాటల్లో నేను ఎన్నడూ విననంత గొప్ప కవిత్వం విన్నాను. చరిత్ర మనిషిని ఆవహించినప్పుడు సాధారణ మనిషి చరిత్ర నిర్మాత అయినప్పుడు అట్లాంటి శక్తివంతమైన వేళల్లో జీవితంలోనుంచి వచ్చే ప్రతి మాటా కవిత్వం కావడం చూస్తాం మనం.

''నేను ప్రెస్‌లో కూచుంటే ఇన్ఫర్మేషన్ వచ్చింది. సుబ్బా పేరు చెప్పాడు గాని గుర్తుపట్టలేక పోయాను. తామ్రపత్ర గ్రహీత అంటేనే కాని సడెన్‌గా కాలేదు'' సంజాయిషీగా అన్నాను.

ఆయన నవ్వాడు.

''వెనకటికి దానపట్టాలు రాగిరేకుల మీద కాదు మహాప్రభో, పూరీల మీద రాయించండి అన్నాడుట ఒక అభాగ్యుడు. ఎందుకు బాబూ ఆ తామ్రపత్రం? అంతకన్నా పిడికెడు అన్నం ప్రభుత్వంవారు దయ చేయించి వుంటే ఒక నిర్భాగ్యుడి పూట ఆకలి తీరి వుండేది అది మమ్మల్నీ, మా త్యాగాల్నీ సన్మానించినంత ఫలం.''

నాకు రక్తం వుడుకెత్తింది. కాళ్లు నేలమీద దృఢంగా, ఆనాయి. రెండు చేతులూ జోడించాను.

''ఏమిటి'' అన్నారాయన కంగారుగా.

''మరేం లేదు'' వినయంగా స్పష్టంగా చెప్పాను. ''మీరు జైల్లో వుండే స్వేచ్ఛగా వున్నారు. కాని మేమే..'' ఇంక మరేమీ మాట్లాడలేక బయటకు వచ్చేశాను.